సాక్షి కుమురం భీం

ఆదివారం । 1 । అక్టోబర్ । 2023



అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా జట్టు
కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో శనివారం రాష్ట్ర స్థాయి జూనియర్స్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి. జిల్లా జట్టు మార్చ్‌ఫాస్ట్‌లో పాల్గొంది.



అంగన్‌వాడీల నిరసన
తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక దీక్షలు 20వ రోజుకు చేరుకున్నాయి. 9లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
31.2/25.3
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. రుతుపవనాలు, తుపాను ప్రభావంతో చాలాచోట్ల జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పెర్సపేన్ మందిరాలకు రూ.6 కోట్ల నిధులు



మంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్న ఎమ్మెల్యే

ఆసిఫాబాద్: జిల్లాలోని 60 పెర్సపేన్ మందిరాలకు రూ.6 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ప్రకటించారు. దీంతో పాటు పాట్నాపూర్ పూలాజీ బాబా మందిరానికి రూ.2 కోట్లు, కొత్తపల్లి దీక్ష భూమికి రూ.2 కోట్లు మంజూరు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ ఎంపీ గోడం నగేశ్ మంత్రి ఐకేరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ పుష్పగుచ్ఛం అందజేశారు.

జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమలు



మాట్లాడుతున్న అచ్చేశ్వర్‌రావ్

ఆసిఫాబాద్‌అర్బన్: శాంతి భద్రతల దృష్ట్యా అక్టోబర్ 1 నుంచి 31 వరకు జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ 1861 అమలులో ఉంటుందని జిల్లా అదనపు ఎస్పీ అచ్చేశ్వర్‌రావ్ తెలిపారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సబ్ డివిజనల్ పోలీసు అధికారి లేదా పోలీసు ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ఎలాంటి సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు నిర్వహించరాదన్నారు. పోలీసు అధికారులకు ప్రజలు సహకరించాలని కోరారు. ఎవరైనా నిబంధనలను ఉల్లంఘిస్తే శిక్షార్హులు అవుతారని ఆయన హెచ్చరించారు.

ప్రొటోకాల్ పాటించలేదని అధికారులపై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న సత్యనారాయణ

సిర్పూర్(టి): మండలంలోని పెద్దబండ–జంబుగ రోడ్డు, అచ్చెల్లి హైలెవల్ వంతెన నిర్మాణ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రొటోకాల్ పాటించలేదని ఆరోపిస్తూ శనివారం వైస్ ఎంపీపీ ఈర్త సత్యనారాయణ ఆర్‌అండ్‌బీ అధికారులపై కలెక్టరు హేమంత్ బోర్కడేకు ఫిర్యాదు చేశారు. స్థానిక సర్పంచ్, ఎంపీటీసీల పేర్లు ప్రారంభోత్సవ శిలాఫలకంపై రాయకుండా ప్రొటోకాల్‌లో లేని మండల కోఆప్షన్ సభ్యుని పేరు రాయడం జరిగిందని వివరించారు. సంబంధిత శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఆధార్ ప్రామాణీకరణతోనే మద్దతు ధర

ఆసిఫాబాద్‌అర్బన్: 2023–24 సంవత్సరానికి గానూ పత్తి పంటను విక్రయించేందుకు ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర రూ.7వేలు పొందాలంటే ఆధార్ ప్రామాణీకరణ తప్పనిసరని జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ ప్రామాణీకరణ కోసం పత్తి కొనుగోలు కేంద్రంలో అన్ని ఏర్పాట్లు చేశామని, ఏదైనా కారణం వలన వేలిముద్ర ప్రామాణీకరణ విఫలమైతే కంటి స్కాన్, ముఖ ప్రామాణీకరణ, ఓటీపీ ద్వారా, ఆధార్‌కార్డుపై ముద్రించబడిన క్యూఆర్ కోడ్ ద్వారా అందించవచ్చన్నారు. ఆధార్ ప్రామాణీకరణ జరుగని పక్షంలో పత్తి కొనుగోలు చేయడం జరుగదన్నారు. రైతులు బ్యాంకు ఖాతాను ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలని సూచించారు.

జాతీయ నాణ్యత ప్రమాణాల బృందం తనిఖీ



మాట్లాడుతున్న ఎన్‌క్యూఏఎస్ అధికారి

వాంకిడి: మండలంలోని బెండార ఆరోగ్య ఉపకేంద్రాన్ని శనివారం జాతీయ నాణ్యత ప్రమాణాల బృందం అధికారులు తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో అందించే సేవలు ఉప ఆరోగ్య కేంద్రాల్లోనూ అందించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ మినిమోల్, ఎంఎస్ నిమిమామ్, రాశి టాపో, డీఎంహెచ్‌వో తుకారాం, డీడీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్, డీడీవో వినోద్, వైద్యుడు వినయ్, ఎస్‌క్యూఏఎస్ మేనేజర్ సాయి, హెచ్‌ఈవో రవిదాస్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



పొలిటికల్ పోలీస్!

- బీఆర్‌ఎస్ నేత హుకుం
- నమ్మిన బంట్లకు పోస్టింగ్
- సీఐల బదిలీలకు రంగం సిద్ధం
- ఆసిఫాబాద్ అసెంబ్లీలో కీలక మార్పులు
- ఎన్నికల 'సహకారం' కోసం ముందస్తు యత్నాలు

సాక్షి, ఆసిఫాబాద్: ప్రతిభకు చోటు లేదు.. క్రమశిక్షణ అవసరమే లేదు.. ప్రజలకు సేవ చేయాలనే చిత్తశుద్ధి అవసరం లేదు. బాధితులకు న్యాయం చేయాలనే సంకల్పం అంతకన్నా లేదు. కావాల్సిందల్లా ప్రజాప్రతినిధుల అండదండలు.. వారి ఆశీస్సులు. ఇవి ఉంటే చాలు.. కావాల్సిన చోట నియామకం.. కోరినన్ని రోజులు ఒకేచోట విధులు. జిల్లా పోలీసు శాఖలో ఎస్సై, సీఐ, డీఎస్పీల బదిలీలు, నియామకాలపై రాజకీయ ముద్ర నానాటికీ పెరిగిపోతోంది. పోలీసు అధికారుల బదిలీల్లో ప్రజాప్రతినిధులకు ఆది నుంచి ప్రమేయం ఉన్నా కొన్నేళ్లుగా ఇది మరింత పెరిగింది. ముఖ్యంగా రాష్ట్ర విభజన తర్వాత జరిగిన ఎన్నికల తర్వాత జిల్లాలో కీలక ప్రజాప్రతినిధుల ఆదేశం లేకుండా ఏఒక్క ఎస్సై, సీఐ, డీఎస్పీ బదిలీ జరగలేదంటే అతిశయోక్తి కాదు.

నమ్మిన బంట్ల కోసం...

రానున్న ఎన్నికల నేపథ్యంలో బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మిని ఆసిఫాబాద్ నియోజకవర్గ అభ్యర్థిగా ప్రకటించారు. తర్వాత నియోజకవర్గ అధికార పెత్తనం ఆమెకే కట్టబెట్టారు. ఈ మేరకు ఆమె మాటే వినాలని జిల్లా ఉన్నతాధికారులకు సైతం మౌఖిక ఆదేశాలు అందినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో తమకు అనుకూలమైన అధికారులను నియమించుకుంటే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సమస్యలు ఉండవనే భావనతో కోవ లక్ష్మి పోలీసు అధికారుల బదిలీలకు శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. తమకు విధేయులుగా ఉన్న డీఎస్పీ, సీఐ, ఎస్సైలు అయితే ఎన్నికల్లో తమ గెలుపునకు ఎంతో కొంత ఉపకరిస్తారని.. గెలుపుపై ప్రభావం చూపకపోయినా.. తమ కార్యకలాపాలకు ఎదురు రారన్న ఆశాభావంతో ఆమె తన పలుకుబడి ఉపయోగించి ఆసిఫాబాద్ డీఎస్పీని బదిలీ చేయించి తమకు అనుకూలంగా ఉండే వ్యక్తికి పోస్టింగ్ ఇప్పించారని ప్రచారం పోలీసు శాఖలో జరుగుతోంది. డీఎస్పీ తర్వాత ఆసిఫాబాద్ బీఆర్‌ఎస్ నేత కన్ను సీఐలపై పడినట్లు తెలుస్తోంది. ఆసిఫాబాద్ పోలీసు స్టేషన్‌కు ఇటీవల వరంగల్ జిల్లా నుంచి బదిలీపై వచ్చిన సీఐ సురేష్‌తో పాటు వాంకిడి సీఐ శ్రీనివాస్, రెబ్బెన సీఐ సురేందర్‌ను సైతం మార్చాలని బీఆర్‌ఎస్ నేత పట్టుబట్టినట్లు సమాచారం. ఇప్పటికే ఆసిఫాబాద్ సీఐకి స్థాన చలనం జరిగినట్లు తెలిసింది. రామగుండం పరిధిలో పనిచేస్తున్న రాజు అనే సీఐ ఇక్కడికి బదిలీపై వస్తున్నారని సమాచారం. గతంలో ఆయన బెల్లంపల్లి సీఐగా పనిచేశారు. కాగా తొలుత వాంకిడి, రెబ్బెన సీఐలను మార్చాలనే యోచనలో ఉన్న కోవ లక్ష్మి ఆతర్వాత మనసు మార్చుకున్నట్లు తెలుస్తోంది. వారిని ఎన్నికల వరకు ఉంచాలనే నిర్ణయానికి వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. డీఎస్పీ, సీఐల బదిలీ వెనుక మాజీ ఎమ్మెల్సీ హస్తం ఉన్నట్లు తెలుస్తోంది.

రాజకీయ పైరవీలు...

త్వరలో ఎన్నికలు రానున్నాయి. కోడ్ కూసిందంటే అన్ని ప్రభుత్వ శాఖల్లో మూడేళ్లకంటే ఎక్కువ పనిచేసే సర్కారు ఉద్యోగులను బదిలీ చేయాలన్నది ఎన్నికల కమిషన్ నిబంధన. ఈ మేరకు ఇటీవలే రాష్ట్ర ఎన్నికల కమిషన్ జిల్లాలో మూడేళ్లకు పైగా పనిచేస్తున్న అధికారులను బదిలీ చేయాలని ఆయా శాఖల అధికారులకూ సూచించారు. ఇందులో భాగంగా పోలీసు శాఖ ఇప్పటికే ఆసిఫాబాద్ జిల్లాలో మూడేళ్లకు పైగా పనిచేస్తున్న ఎస్సై, సీఐలను బదిలీ చేసింది. జిల్లాలో రెండు పోలీసు డివిజన్‌లున్నాయి. ఆయా డివిజన్లలో పనిచేసే కొందరిపై ఆరోపణలు ఉండగా.. మరికొందరికి మూడేళ్ల కాలం పూర్తయింది. ఈ నేపథ్యంలో బదిలీలు తప్పనిసరి అయ్యాయి. అయితే ఈ బదిలీలన్నీ రాజకీయ పైరవీలతో జరగనున్న నేపథ్యంలో అధికార పార్టీకి చెందిన నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో పోలీసు అధికారులు నిమగ్నం కావడం విశేషం.

జాగ్రత్తలే రక్ష!

- సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి
- అన్నిరకాల మందులు సిద్ధంగా ఉంచాం
- 'సాక్షి' ఇంటర్వ్యూలో డీఎంహెచ్‌వో తుకారాం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో తుకారాం

ఆసిఫాబాద్‌అర్బన్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి తుకారాం సూచించారు. జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, సబ్ సెంటర్‌లలో పూర్తి స్థాయిలో వైద్య సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో వైద్యశాఖ తీసుకుంటున్న చర్యలు, ప్రజల్లో ఉన్న సందేహాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై 'సాక్షి' ఇంటర్వ్యూలో వివరించారు.

సాక్షి: సీజనల్ వ్యాధులపై ప్రజలను ఎలా అప్రమత్తం చేస్తున్నారు?

డీఎంహెచ్‌వో: డిస్ట్రిక్ కోఆర్డినేషన్ కమిటీ (డీసీసీ) ద్వారా అన్ని గ్రామాలు, పట్టణాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. వ్యాధులను గుర్తించేందుకు జిల్లా వ్యాప్తంగా మూడు సబ్ యూనిట్ అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. 20 మంది మెడికల్ ఆఫీసర్లు పర్యవేక్షిస్తున్నారు. ప్రతీ శుక్రవారం డ్రైడే నిర్వహిస్తున్నాం. ప్రతీ కుటుంబానికి దోమతెరలు అందించాం. ఐటీడీఏ, పంచాయతీరాజ్, ఎంపీడీవోల సహకారంతో వ్యాధుల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. ఐదేళ్ల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాం.

సాక్షి: వ్యాధుల కట్టడికి తీసుకోవాల్సిన చర్యలు ఏమిటి?

డీఎంహెచ్‌వో: ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలి. నీటిని వేడిచేసి చల్లార్చి వడబోసిన తర్వాత మాత్రమే తాగాలి. ఆహారం వేడిగా ఉండగానే భుజించాలి. అన్ని పీహెచ్‌సీల్లో వ్యాధుల నివారణ మందులు అందుబాటులో ఉంచాం.

సాక్షి: డెంగీ, టైఫాయిడ్ నిర్ధారణ ఎలా?

డీఎంహెచ్‌వో: జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల్లో సీబీపీ (బ్లడ్ పిక్చర్, ప్లేట్‌లెట్స్, కౌంటింగ్) యంత్రాలు ఉన్నాయి. ప్రజలకు ఉచితంగా రోగ నిర్ధారణ పరీక్షలు అందుతున్నాయి. జిల్లా కేంద్రంలోని టీహబ్ ద్వారా 53 రకాల రోగ నిర్ధారణ పరీక్షలు చేయించుకునే అవకాశం ఉంది. డెంగీ ఎలిజ టెస్టు ద్వారానే కచ్చితమైన ఫలితం వస్తుంది.

సాక్షి: వైద్యశాఖ అందించే చికిత్సలు ఏమిటి?

డీఎంహెచ్‌వో: అన్ని పీహెచ్‌సీల్లో యాంటిబయాటిక్స్, క్లోరోక్విన్, ప్రైమ్ ఆక్సిజన్, ఆర్డిపీసీటి, అన్ని రకాల విటమిన్స్, నొప్పులు, సిప్రోఫ్లోక్సిన్, మెట్రోజిల్, ఫ్లోరోక్సిన్, స్పోర్‌లాక్, సీసీఎం, డెరిఫిల్లిన్, దగ్గు మందులు, మాత్రలు, ఐవీ ఫ్లూయిడ్స్ అందుబాటులో ఉన్నాయి. జిల్లాలోని 20 పీహెచ్‌సీలు, 2 అర్బన్ సెంటర్‌లు, 118 సబ్ సెంటర్‌ల ద్వారా ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నాం.

సాక్షి: గ్రామీణులకు అత్యవసర వైద్యం అందేదెలా?

డీఎంహెచ్‌వో: రోగిని ఇంటి నుంచి ఆస్పత్రులకు తీసుకువచ్చేందుకు 8 అవ్వాల్, 12 (108) వాహనాలు, 15 (102) వాహనాలు, 1 ఎఫ్‌హెచ్‌ఎస్ వాహనం అందుబాటులో ఉంచాం.

సాక్షి: సీజనల్ వ్యాధుల వివరాలు తెలపండి?

డీఎంహెచ్‌వో: ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో డెంగీ–81, మలేరియా–69, టైఫాయిడ్–231 కేసులు నమోదయ్యాయి.

గౌడ కులస్తులకు 10 సీట్లు కేటాయించాలి

- మోకుదెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేసరి ఆంజనేయులుగౌడ్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు గౌడ కులస్తులకు 10 సీట్లు కేటాయించాలని మోకుదెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేసరి ఆంజనేయులుగౌడ్ డిమాండ్ చేశారు. గౌడ హక్కులు, చట్టసభల్లో వాటా సాధనకోసం మోకుదెబ్బ ఆధ్వర్యంలో ఈ నెల 3న నిర్మల్‌లో తలపెట్టిన గౌడ జనగర్జన సభకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం జిల్లా కేంద్రంలోని బీసీ సంఘ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లోని నీరా కేఫ్‌ను ప్రభుత్వం కాంట్రాక్టర్లకు అప్పగించడం దుర్మార్గమైన చర్య అన్నారు. గౌడ సొసైటీకి మాత్రమే టెండర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కొండ్ర మనోహర్, జువ్వాజి అనిల్‌గౌడ్, తాళ్ల శ్రీనివాస్‌గౌడ్, మార్క శంకర్‌గౌడ్, నగునూరి నీరజ గౌడ్, కొండ్ర అరుణ గౌడ్, నీలాగౌడ్, అన్నపూర్ణ, మురళీగౌడ్, రంగు శ్రీనివాస్ గౌడ్, సంతోశ్‌గౌడ్, అన్నపూర్ణ, అరుణ, సంజీవ్ గౌడ్, ప్రసాద్‌గౌడ్, కిష్టాగౌడ్, తిరుపతి గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నలుగురు వైద్యాధికారుల నియామకం



నియామకపత్రం అందజేస్తున్న కలెక్టర్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఒప్పంద ప్రాతిపదిన వైద్యాధికారులను నియమించినట్లు కలెక్టర్ హేమంత్ బోర్కడే తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో నలుగురు వైద్యాధికారులకు నియామకపు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒప్పంద ప్రాతిపదికన సివిల్ అసిస్టెంట్ సర్జన్ వైద్యాధికారులను నియమించామన్నారు. పెంచికల్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి డాక్టర్ ఆశ్రిన్, తిర్యాణి కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రానికి డాక్టర్ లక్ష్మీప్రసన్న, వాంకిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి డాక్టర్ రుద్రాణి, జైనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి డాక్టర్ ఎండీ నిసారుద్దీన్‌ను నియమించినట్లు ఆయన పేర్కొన్నారు. వైద్యాధికారులు విధుల్లో సమయపాలన పాటిస్తూ, వైద్య సేవల కోసం వచ్చే ప్రజలతో స్నేహభావంగా ఉంటూ చికిత్స అందించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో తుకారాం, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ



ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు

కాగజ్‌నగర్‌టౌన్: మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం పట్టణంలో మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. జామా మసీదులో మధ్యాహ్నం ప్రత్యేక నమాజ్ (ప్రార్థనల) అనంతరం మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్, మిలాద్ కమిటీ పదాధికారులు మొహమ్మద్ హాజి, మహమ్మద్ బేగ్, సయ్యద్ హాజి, అబ్దుల్ ముబీన్, ఆరీఫ్‌ఖాన్, మతీన్ పాషా, హబీబ్, వసీమ్, ఖదీర్ పాల్గొన్నారు.

మజ్జిగ, పండ్లు పంపిణీ

ర్యాలీలో పాల్గొన్న ముస్లింలకు ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో జెడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు, బీఆర్‌ఎస్ శ్రేణులు మజ్జిక, లస్సీ, మంచినీటి బాటిళ్లను పంపిణీ చేశారు. బీఎస్పీ తాలూకా ఇన్‌చార్జి అర్షద్ హుస్సేన్ బాదం మిల్క్, శీతల పానీయాలు, కాంగ్రెస్ తాలూకా ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు.

విద్యా సామర్థ్యాలకు పరీక్ష

- ఇప్పటికే ముగిసిన రెండు పరీక్షలు
- నవంబర్ 3న జాతీయ సాధన సర్వే



సాంగ్వీలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కెరమెరి(ఆసిఫాబాద్): విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు అంచనా వేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఏటా జాతీయ సాధన సర్వేలు నిర్వహిస్తోంది. ఇందులో ఆశించిన స్థాయిలో ఫలితాలు ఉండడం లేదు. విద్యార్థులు చతుర్విధ ప్రక్రియలు (కూడిక, తీసివేత, గుణకారం, భాగాహారం) చేయలేక పోతున్నారు. తెలుగు, ఆంగ్లం అనర్గళంగా చదవలేక పోతున్నారు. దీంతో కేంద్ర ప్రభుత్వం నవంబర్ 3న మరోసారి జాతీయ సాధన సర్వే నిర్వహించనుంది. ఇందులో రాష్ట్రంలోని విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా చేయడానికి ఎస్‌సీఈఆర్టీ చర్యలు చేపట్టింది. సీస్ (ఎస్‌ఈఏఎస్–స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే)పరీక్షల పేరుతో విద్యార్థులను ముందస్తుగా సర్వే చేయనున్నారు. ఈ మేరకు మొత్తం ఆరు పరీక్షలు నిర్వహించనున్నారు.


3, 6, 9 తరగతులకు మాత్రమే!

జిల్లాలో 720 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 41,924 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 3, 6, 9 తరగతుల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను సీస్ పరీక్షల ద్వారా తెలుసుకోనున్నారు. సుమారు ఆరు నమూనా పరీక్షలు నిర్వహించనున్నారు. మొదటి పరీక్ష ఈ నెల 23న, రెండో పరీక్ష 27న నిర్వహించారు. మూడో పరీక్ష అక్టోబర్ 3న, నాలుగో పరీక్ష 27న, ఐదో పరీక్ష 31న, ఆరో పరీక్ష నవంబర్ 2న నిర్వహించనున్నారు. ఇందుకోసం ఎస్‌సీఈఆర్టీ ప్రత్యేకంగా ప్రశ్నపత్రాలను ముద్రించి జిల్లా విద్యాశాఖ అధికారులకు అందజేసింది. తెలుగు, ఆంగ్లం, ఉర్దూ మాధ్యమాల్లో వీటిని ముద్రించారు. పరీక్షకు ముందురోజు మండలాల్లో ఉన్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు.

ఇవి తెలుసుకోవచ్చు!

ఉపాధ్యాయులు చెప్పే విషయాలను విద్యార్థి ఏమేరకు వింటున్నాడు? అవగాహన కలుగుతోందా? తిరిగి స్పందించే తీరు ఎలా ఉంది? చెప్పిన విషయాలను జ్ఞాపకం ఉంచుకుంటున్నాడా? అనే విషయాలకు సంబంధించి పరిశీలన చేయనున్నారు. సబ్జెక్టు అంశాలతో పాటు నిత్య జీవితంలో విద్యార్థులు గమనించే అంశాలపైనా పరీక్ష ఉంటుంది. విద్యార్థులు సమాధాన పత్రాలను ఉపాధ్యాయులు దిద్దిన తర్వాత, మరుసటి రోజు తరగతి గదిలో విద్యార్థులతో సమీక్షిస్తారు. సరైన సమాధానాలు రాస్తే అభినందించడం, తప్పులు రాస్తే ఎలా రాయాలో వివరించడం చేస్తారు. పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించేందుకు ఈ సాధన సర్వే నిర్వహిస్తున్నారు.

నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం



సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు తెలుసుకోవడం జరుగుతోంది. ఇందులో భాగంగా సీస్ పరీక్షలు నిర్వహిస్తున్నాం. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను తెలుసుకునేందుకు ఎస్‌ఈఏఎస్ సర్వే ఎంతగానో ఉపయోగపడుతుంది.
– పీ.అశోక్, జిల్లా విద్యాశాఖ అధికారి

బీజేపీలో చేరిన బీఆర్‌ఎస్ జెడ్పీటీసీ



బీజేపీలో చేరుతున్న నీరటి రేఖ

కాగజ్‌నగర్‌టౌన్/సిర్పూర్(టి): సిర్పూర్(టి) బీఆర్‌ఎస్ జెడ్పీటీసీ నీరటి రేఖ శనివారం బీజేపీలో చేరారు. హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి సమక్షంలో 200 మంది బీఆర్‌ఎస్ కార్యకర్తలతో కలిసి బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ హరీష్ బాబు మాట్లాడుతూ ఈచేరిక కేవలం ఆరంభం మాత్రమేనని త్వరలోబీఆర్‌ఎస్ నుంచి నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున బీజేపీలో చేరనున్నట్లు వెల్లడించారు.

జోనల్‌స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

తిర్యాణి(ఆసిఫాబాద్): జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన డివిజన్ స్థాయి ట్రైబల్ వెల్ఫేర్ స్పోర్ట్స్ మీట్‌లో మండలంలోని రోంపెల్లి ఆశ్రమ పాఠశాలకు చెందిన 20 మంది విద్యార్థులు ప్రతిభ కనబర్చి జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆత్రం సాగర్ తెలిపారు. నవంబర్ 12, 13 తేదీల్లో జిల్లా కేంద్రంలో జరుగనున్న జోనల్ స్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొననున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా సదరు విద్యార్థులను అభినందించారు. ఈకార్యక్రమంలో పీఈటీ పి. సుభాష్, ఉపాధ్యాయులు సత్యనారాయణ, వెంకటేశం, గణపతి, శ్రీనివాస్, గోపి, మహేందర్, శ్రావణ్, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

బీపీఏలో 145 శాతం బొగ్గు ఉత్పత్తి



మాట్లాడుతున్న జీఎం రవిప్రసాద్

రెబ్బెన(ఆసిఫాబాద్): గడిచిన సెప్టెంబర్ మాసంలో బెల్లంపల్లి ఏరియా 145 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించిందని ఏరియా జీఎం రవిప్రసాద్ పేర్కొన్నారు. శనివారం గోలేటి టౌన్‌షిప్ లోని జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏరియాకు 2లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించగా 2.90 లక్షల టన్నులతో 145 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 123 శాతం ఉత్పాదకతతో బెల్లంపల్లి ఏరియా ముందుకెళ్తోందన్నారు. కై రిగూడ ఓసీపీకి సెప్టెంబర్ నెలకు గానూ 2లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యానికి గానూ 2.90 టన్నుల ఉత్పత్తి సాధించిందన్నారు. ఈ ఏడాది చివరి నాటికి గోలేటి ఓసీపీ ద్వారా ఉత్పత్తి ప్రక్రియను ప్రారంభించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ఓసీపీ ప్రారంభానికి కావాల్సిన అన్ని అనుమతులను త్వరితగతిన పొందేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. సమావేశంలో డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహెరా, డీవైపీఎం తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లారీని ఢీకొట్టిన కోళ్ల వ్యాన్



లారీని ఢీ కొట్టిన వ్యాన్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట శివయ్య కాలనీ సమీపంలో శనివారం ఆగి ఉన్న లారీని కోళ్ల వ్యాన్ ఢీ కొట్టింది. అయితే డీజిల్ అయిపోవడంతో లారీని నిలిపివేయగా వెనక నుంచి కోళ్ల వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

ఎలుగుబంటిదాడిలో వ్యక్తికి తీవ్రగాయాలు



తీవ్ర గాయాలపాలైన పశువుల కాపరి

సిర్పూర్(టి): మండలంలోని భూపాలపట్నం గ్రామ శివారులో శనివారం గేదెలను మేత కోసం తీసుకెళ్లిన పశువుల కాపరి కత్తరసాల మొగిలిపై ఎలుగు బంటి దాడి చేసింది. దీంతో తీవ్ర గాయాలు కావడంతో చుట్టుపక్కల పంట చేనుల్లోని రైతులు గమనించి గ్రామానికి తీసుకువచ్చి ప్రథమ చికిత్స చేయించి అనంతరం సిర్పూర్(టి) ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట గ్రామానికి చెందిన దుర్గం రాజ్‌కుమార్(35) శనివారం బలవన్మరణానికి పాల్పడాడు. ఎస్సై నరేశ్‌కుమార్ కథనం మేరకు.. గుడిపేటలో నివాసం ఉంటున్న దుర్గం రాజ్‌కుమార్ కొన్నేళ్లుగా చెడు వ్యసనాల బారినపడగా ఏడాది క్రితం తీవ్ర అనారోగ్యానికి గురై ఏడాదిగా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నాడు. ఆరోగ్యం కుదుటపడకపోవడంతో జీవితంపై విరక్తితో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి సోదరుడు మారుతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలపారు.

ఆటోబోల్తా.. ఐదుగురికి గాయాలు

ఇంద్రవెల్లి: ఆటో బోల్తాపడి ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన శనివారం మండలంలోని హీరాపూర్ గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... పనినిమిత్తం ఇంద్రవెల్లి నుంచి దన్నోర(బి) గ్రామానికి వెళ్తున్న ఆటో కుక్క అడ్డు రావడంతో తప్పించే క్రమంలో ప్రమాదవశాత్తు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ సురేష్‌తో పాటు ఆటోలో ప్రయాణిస్తున్న మిథున్, తారక్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. 108లో క్షతగాత్రులను ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు.

రక్తదాతలు.. ప్రాణప్రదాతలు



రక్తదానం చేస్తున్న బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు

రక్తదానం చేసిన బీఎస్ఎన్ఎల్ సిబ్బంది..

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రక్తనిధి కేంద్రంలో శనివారం బీఎస్ఎన్ఎల్ సిబ్బంది రక్తదాన చేశారు. అక్టోబర్ 01 బీఎస్ఎన్ఎల్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని 20మంది ఉద్యోగులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా బీఎస్ఎన్ఎల్ డివిజనల్ ఇంజనీర్ సోమయ్య మాట్లాడారు. సికిల్‌సెల్, తలసేమియా వ్యాధి గ్రస్తుల సహాయార్థం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. యువత రక్తదానంపై అపోహలు వీడి రక్తదానికి ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ భాస్కర్‌రెడ్డి, రక్తనిధి ఇన్‌చార్జి మధుసూదన్‌రెడ్డి, రక్తదాతలు శ్రీధర్, రవికుమార్, మధుకర్, సదాశివ, బండ దిలీప్‌కుమార్, శ్రీనివాస్, తిరుపతి, మహేందర్, రాజేశం, కుమారస్వామి, రహీం బ్లడ్ డొనేషన్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు అబ్దుల్ రహీం పాల్గొన్నారు.

అత్యవసర సమయాల్లో రక్తం అందక పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. దీంతో ప్రభుత్వాలు, పలు స్వచ్ఛంద సంస్థలు రక్తదానంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. అయినా పలు సమయాల్లో రక్తం అందక పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. కొన్ని సమయాల్లో బ్లడ్ బ్యాంక్‌ల్లో రక్తనిల్వలు అందుబాటులో లేక దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు తీవ్ర ఇబ్బంది పడాల్సిన దుస్థితి. ఈ నేపథ్యంలో ఇండియన్ సొసైటీ ఆఫ్ బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ అండ్ ఇమ్యూనో హెమటాలజీ ద్వారా 1975 అక్టోబర్ 01న జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం నిర్వహిస్తోంది. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో పలువురు రక్తదానం చేస్తూ ప్రాణప్రదాతలుగా మారుతున్న వారి అభిప్రాయాలతో కథనం...

- అత్యవసర సమయాల్లో అందని రక్తం
- పలువురు రక్తదాన శిబిరాలు ఏర్పాటుతో ముందుకు
- ప్రజలకు అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థలు
- నేడు జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం

రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో...

పాతమంచిర్యాల: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఆవరణలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ద్వారా దాతల నుంచి స్వచ్ఛందంగా రక్తాన్ని సేకరించి తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వ ఆస్పత్రుల్లోని గర్భిణులకు, అత్యవసర పరిస్థితుల్లోని వారికి రక్తాన్ని అందిస్తున్నారు.

రోగులు కోలుకుంటే సంతృప్తి



పాతమంచిర్యాల: నేను 21 సార్లు రక్తదానం చేశాను. 10సార్లు ఉచితంగా ప్లేట్‌లెట్స్ దానం చేసి డెంగీ వ్యాధిగ్రస్తులను కాపాడాను. వృత్తిరీత్యా వ్యాపారం చేసుకుంటాను. రక్తం కావాలని ఫోన్ చేస్తే వెంటనే స్పందించి జిల్లా కేంద్రంలోనే కాకుండా ఇతర ప్రాంతాల్లోని ఆస్పత్రులకు సైతం వెళ్లి రక్తదానం చేశాను. తాను రక్తదానం చేసిన తర్వాత రోగులు కోలుకుని తనకు ఫోన్‌లు చేసి అభినందిస్తారు. దీంతో నాకు ఎంతో సంతృప్తి కలుగుతుంది.

– గుమాస ప్రమోద్, కాసిపేట

ఎనిమిదేళ్లుగా సేవలో



పాతమంచిర్యాల: ఎనిమిదేళ్ల క్రితం కొద్దిమంది మిత్రులతో కలిసి రహీం బ్లడ్ డొనేషన్ వెల్ఫేర్ సొసైటీ ప్రారంభించాను. రక్తం అవసరం ఉన్న వారికి సికిల్‌సెల్, తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం రక్తనిధి కేంద్రంలో రక్తదాన శిబిరాల ద్వారా రక్తం సేకరిస్తున్నాం. ఏ ఆస్పత్రిలో రోగికి అవసరం ఉందని సమాచారం వచ్చినా వెంటనే స్పందించి రక్తం అందించి రోగుల ప్రాణాలు కాపాడడానికి తమ వంతు సహకారం అందిస్తున్నాం. ఇప్పటి వరకు 1800 మందికి స్వచ్ఛందంగా రక్తం అందించాం.

– అబ్దుల్ రహీం. రహీం బ్లడ్ డొనేషన్ వెల్ఫేర్ సొసైటీ, మంచిర్యాల

సంతృప్తి.. సంతోషం



ఆసిఫాబాద్: ఇప్పటి వరకు 33 సార్లు రక్తదానం చేశాను. ప్రతీ మూడు మాసాలకోసారి రక్తదానం చేస్తాను. ముఖ్యంగా తలసేమియా వ్యాధిగ్రస్తులకు ఇస్తుంటాను. మోవాడ్‌లో ఒక తలసేమియా పేషెంట్ కోసం వెంకటాపూర్ సర్పంచ్ ఫోన్ చేస్తాడు. దీంతో వెంటనే రక్తం ఇవ్వడం జరుగుతుంది. ఎవరికి ఆపద ఉన్న రక్తదానం చేస్తాను. రక్తదానంతో ప్రాణదానం చేసిన సంతృప్తితో పాటు సంతోషం లభిస్తుంది.

– వైరాగరే ప్రతాప్, ఆసిఫాబాద్

46సార్లు రక్తదానం...



రక్తదానం చేస్తున్న మధుసూదన్(ఫైల్)

లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ కో–ఆర్డినేటర్ ఫర్‌బ్లడ్ డొనేషన్ క్యాంప్, ఇండియన్ రెండ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధి మధుసూదన్ ఇప్పటి వరకు 46సార్లు స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రజల మన్ననలు పొందాడు. అరుదైన ఏబీ నెగెటివ్ గ్రూపు కలిగిన అతడు అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు రక్తాన్ని అందించి పలువురిని ప్రాణాపాయం నుంచి కాపాడారు. ఆయన సేవలను గుర్తించి రాష్ట్ర గవర్నర్, కలెక్టర్‌లు ప్రశంసాపత్రాలు ఇచ్చి సన్మానించారు.

రోగులకు ఆసరాగా..



పాతమంచిర్యాల: ఇప్పటి వరకు 20 సార్లు రక్తదానం చేశాను. రహీం బ్లడ్‌డొనేషన్ వెల్ఫేర్ సొసైటీలో సభ్యులుగా ఉన్న తనకు ఎక్కడి నుంచి ఫోన్ వచ్చిన రాత్రిపగలు తేడా లేకుండా అత్యవసర సమయాల్లో రక్తదానం చేసి రోగులకు ఆసరాగా నిలుస్తున్నాను.

– మహ్మద్ ముజాహిద్, మంచిర్యాల

రక్తదాతలను ప్రోత్సహిస్తా



ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలోని బ్లడ్ బ్యాంకులో రక్తం నిల్వ లేనప్పుడు నన్ను సంప్రదిస్తారు. అలాంటి సందర్భంలో వెంటనే రక్తదాతలను తీసుకొచ్చి రక్తదానం చేయిస్తాను. నేను కూడా ఆరు సార్లు రక్తదానం చేశాను. ఇప్పటి వరకు బ్లడ్ బ్యాంకులో సుమారు వెయ్యి యూనిట్లు రక్తం ఇప్పించాను. అవసరమున్న వారు సెల్ నెం.9573854347 సంప్రదించవచ్చు.

– మాదిశెట్టి ప్రశాంత్, సామాజిక కార్యకర్త

అపోహలు వీడి..



నిర్మల్ చైన్‌గేట్: రక్తదానం ప్రాణదానం వంటిది. ప్రతీఒక్కరు రక్తదానం చేయవచ్చు. ప్రతీ మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చు. నేను ఇప్పటి వరకు 56సార్లు రక్తం ఇచ్చాను. అపోహలు వీడి రక్తదానానికి ముందుకు రావాలి.

– వేణుగోపాలకృష్ణ, జిల్లా ఆస్పత్రి వైద్యుడు

సంతృప్తినిస్తుంది



ఆదిలాబాద్: అత్యవసర పరిస్థితిలో రక్తదానం చేయడంతో ఇతరుల ప్రాణాలను నిలబెట్టిన వారమవుతాం. ఇటువంటి సందర్భాల్లో ప్రతీఒక్కరు ముందుకు రావాలి. ఇప్పటివరకు నేను 32సార్లు రక్తదానం చేశాను. ఒక రాష్ట్రస్థాయి అవార్డు సైతం వచ్చింది. ఈ అవార్డులు రివార్డుల కన్నా రక్తదానం చేయడమే సంతృప్తినిస్తుంది.

– అబ్దుల్ అజీజ్, బెస్ట్ ఫ్రెండ్స్ హెల్ప్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు

ముందుకు రావాలి



ఆదిలాబాద్: జిల్లాలో ఎంతోమంది రక్తహీనతతో బాధపడుతున్నారు. అటువంటివారు సరైన సమయంలో రక్తం దొరకక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారి సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటివరకు 60 సార్లు రక్తదానం చేశాను. గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా ప్రపంచ రక్తదాతల దినోత్సవం రోజున పురస్కారం సైతం తీసుకున్నాను.

– ఉత్తర్‌వార్ గణేష్, ఆదిలాబాద్

ఎవరికి అవసరం ఉన్నా..



కౌటాల: రక్తదానం చేయడంతో ఆరోగ్యంగా ఉంటాం. ఇప్పటి వరకు నేను పది సార్లు రక్తదానం చేశాను. అత్యవసరంలో ఉన్న వారికి రక్తదానం చేసినప్పుడు చాలా ఆనందంగా ఉంటుంది. నా బ్లెడ్ గ్రూప్ ఎ పాజిటివ్. ఎవరికి అవసరం ఉన్న రక్తదానం చేయడంలో నేను ముందుంటాను.

– బాలజీ, గుడ్లబోరి, కౌటాల

ప్రాణాలు దక్కుతాయి



కౌటాల: రక్తదానం చేస్తేనే రక్తం అవసరం ఉన్నవారి ప్రాణాలు దక్కుతాయి. నేను ఇప్పటి వరకు ఐదు సార్లు రక్తదానం చేశాను. ఆసుపత్రిలో చాలా మంది నిరుపేద రోగులు రక్తం కోసం ఇబ్బందులు పడుతున్నారని సోషల్ మీడియాలో వస్తే వెళ్లి రక్తదానం చేసి వస్తాను. నావంతుగా అవసరం ఉన్నవారికి రక్తదానం చేస్తున్నాను.

– మోర్లె పాండురంగ్, కన్నెపల్లి, కౌటాల

యోగా పోటీల్లో 'బెల్లంపల్లి'కి పతకాలు




పతకాలతో బెల్లంపల్లి యోగా విజేతలు

బెల్లంపల్లి: జాతీయ స్థాయి యోగా పోటీల్లో బెల్లంపల్లికి బంగారు పతకాలు వరించాయి. గోవా యూత్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు జరిగిన ఆల్ ఇండియా జాతీయ స్థాయి యోగా పోటీల్లో బెల్లంపల్లికి చెందిన యోగా క్రీడాకారులు అత్యంత ప్రతిభ కనబర్చారు. బెల్లంపల్లిలోని వశిష్ట యోగా శిక్షణ సెంటర్ టీచర్ రమణ ఆధ్వర్యంలో 12మంది పోటీల్లో పాల్గొనగా నాలుగు బంగారు పతకాలు, ఒక వెండి పతకం సాధించారు. 8–15 సంవత్సరాల విభాగంలో దాసరి కుషి, 16 సంవత్సరాల విభాగంలో గుర్రం మానస, 25–30 సంవత్సరాల విభాగంలో కర్ణకొండ శిరీష, 30–40 సంవత్సరాల విభాగంలో ఏనుగు హేమలత బంగారు పతకాలు సాధించగా, 30–40 సంవత్సరాల విభాగంలో పులి అశోకకుమారి వెండి పతకం సాధించింది. ఈ పోటీలకు రమణ జడ్జిగా వ్యవహరించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆల్ ఇండియా యూత్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ విద్య కిరణ్ పతకాలు, బహుమతులు అందజేశారు. బెల్లంపల్లి నుంచి పతకాలు సాధించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఐటీఐలో ఐదో విడత అడ్మిషన్లకు అవకాశం

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలో నా లుగు దఫాలో మిగి లిన సీట్ల భర్తీకి ఐదో విడత దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందని మంచిర్యాల ఐటీఐ ప్రిన్సిపాల్ చందర్ తెలిపారు. ఐదో విడత ఐటీఐ అడ్మిషన్ల రిజిస్ట్రేషన్లకు అక్టోబర్ 1 తుది గడువుగా నిర్ణయించినట్లు తెలిపారు. ఐటీఐలో ప్రవేశాలు పొందే విద్యార్థుల ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలో అక్టోబర్ 9లోగా నిర్ణీత సమయంలో ఐటీఐ రిజిస్ట్రేషన్ల ఫారం, సంబంధిత ధృవపత్రాలతో హాజరుకావాలన్నారు. ఐదో దఫా అడ్మిషన్ల కోసం ఇంతకుముందు ఆఫ్‌లైన్ చేసుకోని అభ్యర్థులు కొత్తగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని, ఇప్పటికే నమోదు చేసుకున్న వారు మళ్లీ నమోదు అవసరం లేదన్నారు.

హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి



వినతిపత్రం అందిస్తున్న టీఏజీఎస్ నాయకులు

వేమనపల్లి: జిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు భాగాల రాజన్న, కార్యదర్శి ఎర్మ పున్నం అన్నారు. శనివారం వేమనపల్లి మండల కేంద్రంలోని పీహెచ్‌సీని సందర్శించి అక్కడి వసతులపై ఆరా తీశారు. పీహెచ్‌సీలో రోగులకు సరిపడా వైద్యసిబ్బంది లేరని ఏడాది కాలంగా పీహెచ్‌సీలో ప్రసవాలే జరగడం లేదన్నారు. వైద్య సిబ్బంది పూర్తిస్థాయిలో లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అనంతరం డీటీ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట టీఏజీఎస్ నాయకులు ఉన్నారు.

కస్టోడియల్ డెత్‌పై న్యాయ విచారణ

మంచిర్యాలక్రైం: బెల్లంపెల్లి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆగస్టు 28న లాకప్ డెత్ జరిగిందనే ఆరోపణలపై శనివారం స్థానిక ఆర్డీవో కార్యాయలంలో ఆర్డీవో రాములు న్యాయ విచారణ చేశారు. బెల్లంపల్లి పట్టణంలోని రైల్వేస్టేషన్ ప్రాంతానికి చెందిన కీర్తి అంజి(27)ని పోలీసులు కొట్టి చంపారంటూ కుటుంబ సభ్యులు ఆరోపించారు. దీనిపై ఆర్డీవో గంటపాటు విచారణ జరిపినట్లు సమాచారం. ఈ విచారణలో ఒక సీఐ, ఇద్దరు ఎస్సైలు, మరో ఇద్దరు హాజరైనట్లు తెలిసింది. ఈ విషయన్ని అధికారులు గోప్యంగా ఉంచడం గమనార్హం.

ఎన్ఎంఎంఎస్‌కు దరఖాస్తు చేసుకోవాలి

దండేపల్లి: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్(ఎన్ఎంఎంఎస్) పరీక్షకు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులు ఈ నెల 13లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈవో యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల హార్డ్ కాపీలను పాఠశాల ప్రధానోపాధ్యాయుల ద్వారా ఈ నెల 16లోగా డీఈవో కార్యాలయంలో అందించాలని పేర్కొన్నారు.

ఓసీపీలో కాంట్రాక్ట్ కార్మికుడి ఆత్మహత్య



వీరస్వామి(ఫైల్)

శ్రీరాంపూర్: విధులకు వద్దన్నారని మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఓపెన్ కాస్టు గనిలో కాంట్రాక్టు కార్మికుడు దొంతగాని వీరస్వామి(50) ఓబీ క్యాంపు సైటు వద్ద శుక్రవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం ఉదయం ఆయన మృతదేహం చెట్టుకు వేలాడుతూ కనిపించింది. శ్రీరాంపూర్ పోలీసులు, కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లాకు చెందిన వీరస్వామికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఇక్కడికి సమీపంలోని రామారావుపేటలో కొంతకాలంగా నివాసం ఉంటున్నాడు. శ్రీరాంపూర్ ఓసీపీ ఓబీ పనులు నిర్వహించే సీఆర్ఆర్ కంపెనీలో జనవరి నుంచి కాంట్రాక్టు కార్మికుడిగా చేస్తున్నాడు. సెప్టెంబర్ 27న కాంట్రాక్టు సంస్థ మేనేజర్ ఉద్యోగంలోకి తీసుకోవడం లేదు. ఏదో వస్తువులు దొంగతనంగా తీసుకెళ్లిన అభియోగంతో ఈ చర్యకు పాల్పడ్డట్లు తోటి కార్మికులు తెలిపారు. దీంతో మనస్తాపం చెంది ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.



కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌రావు

నష్టపరిహారం చెల్లించాలని ఆందోళన

మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించకుండా ఓబీ కాంట్రాక్ట్ కార్మికులు ఆందోళన చేశారు. పనిలోకి తీసుకోకపోవడం వల్లే ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించారు. శ్రీరాంపూర్ ఓసీపీ పీఓ పురుషోత్తం రెడ్డి, మేనేజర్ సుధీర్ ఆందోళనకారులు, ఓబీ కాంట్రాక్టర్‌తో చర్చలు జరిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌రావు, ఐఎన్టీయూసీ నాయకులు శంకర్‌రావు, కలవేని శ్యాం, ఏఐటీయూసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ సెక్రెటరీ అఫ్రోజ్‌ఖాన్ ఆందోళన తీవ్రతరం చేశారు. దీంతో కాంట్రాక్ట్ సంస్థ రూ.8.20లక్షలు నష్ట పరిహారంగా ఇస్తానని చెప్పడంతో ఆందోళన విరమించారు.

గనులను సుందరీకరించాలి



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఏరియా అధికారులు

శ్రీరాంపూర్: సింగరేణి గనులు, విభాగాల్లో పరిసరాలను సుందరీకరించాలని కంపెనీ డైరెక్టర్ (ప్రాజెక్ట్, ప్లానింగ్) వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన కొత్తగూడెం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జీఎంలతో మాట్లాడారు. ఈ సందర్భంగా శ్రీరాంపూర్ ఇన్‌చార్జి జీఎం కే రఘుకుమార్‌కు పలు ఆదేశాలు జారీ చేశారు. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు సింగరేణి వ్యాప్తంగా అక్టోబర్ 2 నుంచి అక్టోబర్ 31 వరకు స్వచ్ఛత స్పెషల్ క్యాంపెయిన్ 3.0 నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగా గనులు, డిపార్టుమెంట్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వాటిని అందంగా ముస్తాబు చేసి స్వచ్ఛత ప్రాముఖ్యతను ఉద్యోగులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్ రెడ్డి, గ్రూప్ ఏజెంట్ ఏవి రెడ్డి, డీజీఎం పర్సనల్ అరవిందరావు, డీజీఎం సివిల్ ఆనంద్ కుమార్, ఎన్విరాన్మెంట్ అధికారి హనుమాన్ గౌడ్ పాల్గొన్నారు.

స్వచ్ఛత ఉద్యమం 3.0 నిర్వహణపై కాన్ఫరెన్స్

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణిలోని అన్ని ఏరియాల అధికారులతో శనివారం సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్టు అండ్ ప్లానింగ్) వెంకటేశ్వర రెడ్డి, డైరెక్టర్ (ఆపరేషన్) శ్రీనివాస్ స్వచ్ఛత ఉద్యమం 3.0 నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 2 నుంచి 31వ వరకు అన్ని ఏరియాల్లో స్వచ్ఛత ఉద్యమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. 15రోజులుగా గుర్తించిన ప్రదేశాలు, కార్యాలయాల్లో స్వచ్ఛత ఉద్యమ కార్యక్రమాలను విజయవంతంగా చేపట్టాలని సూచించారు. ఈ ఉద్యమంలో అధికారులు, ఉద్యోగులు, ఉద్యోగుల కుటుంబాలు పాలు పంచుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి జీఎం ఎస్. సత్యనారాయణ, డీజీఎం సివిల్ సతీష్‌బాబు, ఎన్విరాన్‌మెంట్ అధికారి హరీష్, ఈఈ సివిల్ మనోజ్‌కుమార్‌లు పాల్గొన్నారు.


మంత్రి గారూ.. తోళ్ల పరిశ్రమ వైపు చూడరూ..!

మందమర్రిరూరల్: మందమర్రి మండల కేంద్రంలో పద్నాలుగు ఏళ్ల క్రితం తోళ్ల పరిశ్రమ ఏర్పాటుకు అప్పటి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటివరకు పరిశ్రమ ఏర్పాటుకు నోచుకోలేదు. పరిశ్రమ ఏర్పడితే వందలాది కుటుంబాలకు ఉపాధి లభిస్తుందని ఎదురు చూస్తున్న వారి ఆశలు అడియాశలే అయ్యాయి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయ్యాక ఉద్యమ నేతనే ముఖ్యమంత్రి కావడంతో తోళ్ల పరిశ్రమకు నిధులు కేటాయించి ప్రారంభిస్తారని భావించగా నిరాశే మిగిలింది. ఆదివారం పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి వస్తున్న రాష్ట్ర మంత్రి మంత్రి కేటీఆర్ తోళ్ల పరిశ్రమ పక్కనే హెలిప్యాడ్‌లో దిగనున్నారు. ఇక్కడి నుంచి ఆయిల్ ఫాం ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి వెళ్లే దారిలో తోళ్ల పరిశ్రమకు కేటాయించిన స్థలంలో నిర్మించిన షెడ్డు ఉంది. మంత్రి పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని చర్మకారుల సంఘం నాయకులు, గతంలో శిక్షణ తీసుకున్న కుటుంబాలు కోరుతున్నాయి.

నవోదయ ప్రవేశ పరీక్ష రెండో విడత జాబితా విడుదల

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని త్రిశూల్ పహడ్‌పై గల కేంద్రీయ జవహర్ నవోదయ జిల్లా విద్యాలయంలో ఆరవ తరగతిలో ప్రవేశం కోసం గత ఏప్రిల్ 29న నిర్వహించిన ప్రవేశ పరీక్షలో 78 సీట్లకు ఫలితాలు విడుదల కాగా 67 మంది విద్యార్థులు ప్రవేశం తీసుకున్నారని విద్యాలయ ప్రిన్సిపాల్ చక్రపాణి తెలిపారు. మిగిలిన 13 సీట్ల ఖాళీలకు విద్యాలయ సమితి మెరిట్ ఆధారంగా 10మంది విద్యార్థులతో రెండో విడత జాబితాను శనివారం సాయంత్రం విడుదల చేసిందని పేర్కొన్నారు. ఆ పది మందిలో ముగ్గురు విద్యార్థుల బ్లాక్ తేడాలు ఉండటంతో నవోదయ విద్యాలయ సమితి ప్రాంతీయ కార్యాలయానికి పునః పరిశీలనకు పంపినట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఎంపికైన విద్యార్థులు ఈ నెల 10వ తేదీ లోగా ప్రవేశాలు తీసుకోవాలని సూచించారు.

పిడుగుపాటుకు రైతు మృతి



దోని సత్తయ్య(ఫైల్)

కౌటాల: కుమురంభీం జిల్లా కౌటాల మండలం ముత్తంపేట గ్రామానికి చెందిన రైతు దోని సత్తయ్య(40) శనివారం సాయంత్రం పిడుగుపాటుకు మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సత్తయ్య ఉదయం గ్రామ శివారులోని తన వరి పొలంలో మందు పిచికారీ చేయడానికి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి తిరిగొస్తుండగా ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ క్రమంలో నడిచి వెళ్తున్న సత్తయ్యపై పిడుగు పడింది. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య గంగుబాయి, కుమారులు శ్రీకాంత్, శ్రీకర్ ఉన్నారు.